**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 71 ఆదివారం జూలై 12 2026, పేజీలు - 4 వెల :2/-


## గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి

-బ్యారేజీ గేట్లు మూస్తే కూలిపోతాయి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

-కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక

-పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ

-జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు

-బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్టు వెల్లడి

హిందుస్థాన్ మీడియా



కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా గేట్లు మూసివేస్తే, వాటి మనుగడకే పెను ప్రమాదం వాటిల్లుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. బ్యారేజీల భద్రత విషయంలో నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను తు.చ. తప్పకుండా పాటించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను వెన్నెము కగా, శ్రీపాద యల్లంపల్లిని గుండెకాయగా అభివర్ణించారు. మేడిగడ్డ నిర్మాణ సమయంలో ఎదురయ్యే సవాళ్లపై గత ప్రభుత్వ హయాంలోనే ఇంజనీర్లు హెచ్చరించినప్పటికీ, కొందరు అధికారులు ఇప్పుడు మాట మారు స్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కమిటీ చేసిన సూచనలనే తమ ప్రభుత్వం పాటి స్తుందని, బీఆర్ఎస్ నేతలతో కూడిన కమిటీ సిఫా ర్సులను పరిగణనలోకి తీసుకోవడం లేదని తేల్చిచెప్పారు. "పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయ కుండా గేట్లు మూసివేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది" అని రేవంత్ రెడ్డి పేర్కొ న్నారు. నిర్మాణాలు స్థిరంగా ఉన్నప్పుడే నీటి నిల్వ, పంపింగ్ సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డలో కనీసం 5 టీఎంసీల నీటి నిల్వ అవసరమని, అయితే భద్రతా ప్రమాణాలకు అనుగు ణంగా నిపుణుల సలహాల మేరకే తదుపరి చర్యలు చేపడ తామని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, లోపభూయిష్టమైన ప్రణాళికల వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి దాపురించిందని ముఖ్యమంత్రి విమర్శించారు. భద్రాచలం వంటి ప్రాంతాలు ముంపునకు గురయ్యేలా నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని, ప్రజల భద్రతకు, ప్రభుత్వ వనరులకు నష్టం కలగకుండా ప్రాజెక్టును పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## రేవంత్ రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారు: కేటీఆర్

-మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్

-100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య

-కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ

హిందుస్థాన్ మీడియా



తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు.ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు: అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

-తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్

-హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి

-తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య

హిందుస్థాన్ మీడియా



దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని స్పష్టం చేశారు.

## టీజీపీఎస్సీ నుంచి మరో జాబ్ నోటిఫికేషన్

-7 టౌన్‌ప్లానింగ్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఉద్యోగ ప్రకటన

-ఈ నెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

-ఆగస్టు 22 వరకు దరఖాస్తులకు తుది గడువు

-అక్టోబరులో రాత పరీక్ష నిర్వహించనున్న కమిషన్

హిందుస్థాన్ మీడియా




తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తాజాగా మరో ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగంలో ఖాళీగా ఉన్న 7 టౌన్‌ప్లానింగ్ సహాయకుల (టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్) పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ సూచించింది. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 22వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. మొత్తం 7 పోస్టులలో 2 రాష్ట్రస్థాయి కేడర్‌కు చెందినవి కాగా, మిగిలిన 5 పోస్టులు మల్టీజోనల్ కేడర్ పరిధిలోకి వస్తాయని టీజీపీఎస్సీ వివరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీ.ప్లానింగ్ లేదా బీటెక్ (ప్లానింగ్)లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది అక్టోబరులో రాతపరీక్ష నిర్వహించనున్నట్లు కమిషన్ తన ప్రకటనలో స్పష్టం చేసింది. నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో అందుబాటులో ఉంటాయి.

## పక్కా వ్యూహాలతో రేవంత్ రెడ్డి వేగం పెంచారు: జగ్గారెడ్డి

-రేవంత్ తీసుకునే నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్న జగ్గారెడ్డి

-వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధమయ్యాయని వెల్లడి

-తాను ఎన్నికల బరి నుంచి తప్పుకుంటానని ఎక్కడి చెప్పలేదన్న జగ్గారెడ్డి

హిందుస్థాన్ మీడియా



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ గెలిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా వ్యూహాలతో వేగం పెంచారని, ఆయన నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో చురుగ్గా లేని ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి ఇప్పటికే అప్రమత్తం చేశారన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగరేసేలా 117 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు, సంగారెడ్డి నియోజకవర్గంపై వస్తున్న ప్రచారానికి జగ్గారెడ్డి గట్టిగా జవాబిచ్చారు. తాను కేవలం సంగారెడ్డి నుంచి పోటీ చేయనని మాత్రమే అన్నానని, అంతేకానీ ఎన్నికల బరి నుంచే తప్పుకుంటానని ఎక్కడా చెప్పలేదన్నారు. భవిష్యత్తులో సంగారెడ్డి స్థానం మహిళలకు కేటాయించినా, లేదా సాధారణ స్థానంగా ఉన్నా సరే.. అక్కడ నుంచి తన అర్థాంగి నిర్మలనే అభ్యర్థిగా బరిలో ఉంటారని స్పష్టం చేశారు. విపక్షాల విమర్శలు, సర్వేలను చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇదే క్రమంలో సొంత పార్టీ నేతలకు కూడా జగ్గారెడ్డి హితవు పలికారు. గతంలో కేసీఆర్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎమ్మెల్యేల పనితీరుపై ఇలాంటి సర్వేలే వచ్చాయని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎవరూ ఎప్పటికీ శాశ్వత వీరులు కారని, తామే గొప్ప అనుకుంటే సాగదన్నారు. ముఖ్యమంత్రి హెచ్చరించిన తర్వాత కూడా తీరు మార్చుకోని ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలో లేదో ముఖ్యమంత్రి, పార్టీ అధిష్ఠానం మాత్రమే నిర్ణయిస్తారని తేల్చి చెప్పారు.

## ఏపీలో విద్యాసంస్థల విస్తరణకు మల్లారెడ్డి శ్రీకారం

-ఏపీపై తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఫోకస్.. తిరుపతిలో కొత్త వర్సిటీ

-తిరుపతిలో మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు

-వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి

-తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం కీలక ప్రకటన

-గతేడాది తిరుపతి, విశాఖలో కాలేజీలు కొనుగోలు చేసిన మల్లారెడ్డి

హిందుస్థాన్ మీడియా



తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యావేత్త, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.. ఏపీలో తన విద్యాసంస్థల సామ్రాజ్యాన్ని విస్తరించే దిశగా కీలక అడుగు వేశారు. తిరుపతిలో 'మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ వర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని తిరుమలలో వెల్లడించారు.నిన్న ఉదయం శ్రీవాణి ట్రస్ట్ దాతగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. గత 35 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలు అందిస్తున్నానని, తిరుపతిలో యూనివర్సిటీ స్థాపించాలన్న తన చిరకాల కల నెరవేరిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 2025లోనే ఈ ఆలోచన చేశానని, శ్రీవారి దయతో ఇప్పుడు అది కార్యరూపం దాల్చిందని తెలిపారు. తెలంగాణలో ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలతో బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకున్న మల్లారెడ్డి, ఇప్పుడు ఇతర రాష్ట్రాలపైనా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఆయన గతేడాది తిరుపతిలో ఒక ఇంజనీరింగ్ కళాశాలను కొనుగోలు చేశారు. అదే ఏడాది నవంబర్‌లో విశాఖపట్నంలోనూ మరో కళాశాలను కొనుగోలు చేసినట్లు గతంలోనే వెల్లడించారు. శ్రీవారి ఆశీస్సులతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలన్నది తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. పాల వ్యాపారంతో జీవితం ప్రారంభించి, విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా ఉన్నత స్థాయికి ఎదిగిన మల్లారెడ్డి, ఇప్పుడు తన 'మల్లారెడ్డి' బ్రాండ్‌ను ఏపీకి విస్తరిస్తున్నారు. అయితే, గతేడాది కొనుగోలు చేసిన కాలేజీ ప్రాంగణంలోనే ఈ డీమ్డ్ వర్సిటీని అభివృద్ధి చేస్తారా? లేక కొత్త ప్రాంగణాన్ని ఎంచుకుంటారా? అనే దానిపై రానున్న రోజుల్లో స్పష్టత రానుంది.

## డ్రగ్స్ మాఫియాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

హిందుస్థాన్ మీడియా




డ్రగ్స్ మాఫియాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఏడాదిలో ఏకంగా ఏడు టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణను డ్రగ్స్ ట్రాన్సిట్ హబ్‌గా మార్చే ప్రయత్నాలకు చెక్ పెట్టారు. ఈగల్ అధికారులు, ఇంటెలిజెన్స్‌తో దేశవ్యాప్తంగా వరుసగా భారీగా డ్రగ్స్‌ను సీజ్ చేశారు. రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో 500 కేజీలు, తాజాగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల నిఘాతో డ్రగ్స్ రవాణా ముఠా ఆగడాలను ఆటకట్టించారు.ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో 385 కేజీల గంజాయిని ఈగల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల పాటు నిఘా ఉంచి డ్రగ్స్ రవాణా ముఠాను ట్రాక్ చేశారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం ఫాలో అయ్యారు. కోల్‌కతా, ముంబై జాతీయ రహదారిపై గంజాయి వాహనాన్ని ఎన్సీబీ రాయ్‌పూర్ బృందం అడ్డుకుంది. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు తరలిస్తున్న గంజాయిని గమ్యానికి చేరకముందే స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్ట్ చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎన్సీబీ అధికారులు ఆపరేషన్ విజయవంతం చేశారు. రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ మాఫియాపై ఈగల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ వ్యతిరేక పోరులో కీలక శక్తిగా ఈగల్ అధికారులు మారారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో మరింత దూకుడుగా ఈగల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.

# రైతు భరోసా రైతన్నకు కొండంత అండ




భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,78,828 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.318.42 కోట్ల నిధులు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రైతులు సకాలంలో సాగు పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం విడతల వారీగా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో నిధుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. రైతు భరోసా నిధులను రుణ బకాయిలు, సేవా ఛార్జీలు లేదా ఇతర బకాయిల పేరుతో ఎట్టి పరిస్థితుల్లోనూ సర్దుబాటు చేయవద్దని జిల్లా కలెక్టర్ బ్యాంకులకు ఆదేశించారు. ప్రభుత్వం జమ చేసిన మొత్తం రైతులకే పూర్తిగా అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతు భరోసా, రైతు బీమా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, సాగునీటి సౌకర్యాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు.

## పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

-సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్



మద్దూరు, హిందుస్థాన్ మీడియా:
మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో గోజాతి పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లంపి స్కిన్ వ్యాధి బారిన పడకుండా గ్రామంలోని ప్రతి రైతు తమ పశువులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ ఒక్కటే సమర్థవంతమైన మార్గమని, పశుసంపదను కాపాడేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మనోహర్, విజయ డైరీ చైర్మన్ దాకూరు తిరుపతి రెడ్డి, రైతులు ఊట్ల లక్ష్మీనరసింహ రెడ్డి, చరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పేదల పెన్నిధి ఎమ్మెల్యే పల్లా : బీఆర్ఎస్ నాయకులు

-మద్దూరు లో ఘనంగా జనగామ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు





మద్దూరు (హిందూస్తాన్ మీడియా):
జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం (జూలై 11) మద్దూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించాయి. మద్దూరు, దూళ్మిట్ట మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు జరిగాయి. పుట్టినరోజును పురస్కరించుకొని మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ప్రైమరీ స్కూల్) విద్యార్థులకు నాయకులు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు పిలుపునిస్తూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

-నీలిమ ఆసుపత్రి ద్వారా ఉచిత కార్పొరేట్ వైద్యం

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్, మంద యాదగిరి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి నిరుపేదల పాలిట ఆపద్బాంధవుడని, నిజమైన ప్రజా నాయకుడని కొనియాడారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని ఎంతోమంది పేద ప్రజలకు తమ సొంత నీలిమ హాస్పిటల్ ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ పల్లా రాజేశ్వర్ రెడ్డి నిరంతరం మానవత్వాన్ని చాటుకుంటున్నారని గుర్తుచేశారు. నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని చెప్పారు.

-హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

ఆర్భాటాలకు పోకుండా ఇలాంటి వినూత్న సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే పుట్టినరోజును జరపడం సంతోషంగా ఉందని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లి ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచి గెలుపొందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్ లు ఉపసర్పంచ్‌లు, మండల పార్టీ ముఖ్య నాయకులు, వివిధ గ్రామ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

-రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారు: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు




భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు రేగా కాంతారావు విమర్శించారు. శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 స్థానాలు గెలుస్తుందని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలో ప్రజలు, రైతులు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం 9 సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పది స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ ఎంతమందికి అమలైందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రైతు బీమా, పోడు భూముల పట్టాల వంటి హామీలు అమలు కాలేదని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి జిల్లా రైతులకు అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అక్రమాలు జరుగుతున్నాయని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందడం లేదని ఆరోపించారు. మూతపడిన పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీలను తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

-సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి: మంత్రి పొంగులేటి



భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలయ్యేందుకు రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.ˊనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి భూ రీ-సర్వే, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూ రీ-సర్వేలో లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని, అవసరమైన పరికరాలు, సిబ్బందిని సమకూర్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 17 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టేందుకు కార్యాచరణ రూపొంది ంచినట్లు తెలిపారు. అక్కినేపల్లి, గుండాల, పెద్దవేంక టాపురం, శుభంపేట గ్రామాల్లో సర్వే పనులు కొనసాగు తున్నాయని, మాదారం గ్రామంలో సోమవారం నుంచి రీ-సర్వే ప్రారంభిం చనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 206 మంది లైసెన్స్ సర్వేయర్లు ఉండగా, ప్రస్తుతం 16 మంది విధుల్లో చేరి సర్వే పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి అడుగులు

-కొత్త ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలపై సమగ్ర అధ్యయనం: సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి




భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
సింగరేణిని బహుముఖ సంస్థగా విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించే అవకాశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. శనివారం సింగరేణి భవన్‌లో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్‌తో జరిగిన సమావేశంలో కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై చేపడుతున్న చర్యలను వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ ఏర్పాటుపై అధ్యయనం కొనసాగుతోందని, ప్లాంట్ సామర్థ్య పెంపు, కేంద్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, స్వదేశీ సాంకేతికత వినియోగం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే తాల్చేర్, ఎంసీఎల్--బీహెచ్ఈఎల్, జేఎస్‌పీఎల్ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేసేందుకు ఈ నెలలో సింగరేణి అధికారుల బృందం పర్యటించనున్నట్లు వెల్లడించారు. భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, బెల్లంపల్లి, రామగుండం ప్రాంతాల్లో భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), గౌతమ్ పోట్రు (పర్సనల్ అండ్ ఫైనాన్స్), ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం (ప్రాజెక్ట్ ప్లానింగ్) జి. దేవేందర్, జీఎం (బిజినెస్ డెవలప్‌మెంట్) రాందాస్, జీఎం (ఆర్ అండ్ డీ) వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

-విద్యార్థుల ఎదుట దాడి చేయడం దుర్మార్గం: సీపీఎం డిమాండ్



మద్దూరు, హిందుస్థాన్ మీడియా:
మద్దూరు మండలం లద్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన ఉపాధ్యాయుడు విష్ణుమూర్తిని వెంటనే సస్పెండ్ చేసి, ఆయనపై కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉండటంతో సీనియర్ ఉపాధ్యాయుడు కొత్తపెల్లి ప్రతాప్‌కు ఇన్‌చార్జి హెచ్‌ఎం బాధ్యతలు అప్పగించారని తెలిపారు. శనివారం ఉదయం విద్యార్థులతో ప్రార్థన కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో మరో ఉపాధ్యాయుడు విష్ణుమూర్తి, ఇన్‌చార్జి హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగడమే కాకుండా దాడి చేసి గాయపరిచినట్లు ఆరోపించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలు బోధించాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల ఎదుటే ఇలాంటి ఘటనలకు పాల్పడడం అత్యంత బాధాకరమని అన్నారు. ఘటనపై వెంటనే చర్యలు తీసుకుని నిందిత ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండీ షఫీ, నాయకులు పిట్టల నరేష్, అబ్దుల్ శంకర్, చిలక శోభన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# 13న బీజేపీ ఆధ్వర్యంలో 'సింగరేణి భరోసా' యాత్ర



భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:
సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13న "సింగరేణి భరోసా" యాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సింగరేణి పరిరక్షణ, అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే యాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి తాడిచెర్ల బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించడం సంస్థ అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. సుమారు 40 వేల మంది సింగరేణి కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుతం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలోనూ సింగరేణికి పూర్తి స్థాయిలో మద్దతు7 లభిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న నిర్వహించే సింగరేణి భరోసా యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి భూక్య రవి నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. రెహమతుల్లా, జిల్లా మీడియా కన్వీనర్ రామారావు, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ గొడుగు శ్రీధర్ యాదవ్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండల అధ్యక్షులు నవీన్, బలగం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఒక్క చుక్క మద్యం ముట్టకుండా... భారత్ గర్వించేలా 'రమ్' సామ్రాజ్యాన్ని ఏలాడు!

**-'ఓల్డ్ మాంక్' బ్రాండ్‌ను శిఖరాగ్రానికి చేర్చిన కపిల్ మోహన్ మద్యం ముట్టని వైనం**

**-ప్రకటనలు లేకుండా కేవలం మౌత్ టాక్‌తోనే బ్రాండ్ విజయవంతం**

**-దీని అసలు సృష్టికర్త కపిల్ మోహన్ సోదరుడు వేద్ రతన్ మోహన్**

**-భారతీయులకు ఇది కేవలం పానీయం కాదు.. జ్ఞాపకాలతో ముడిపడిన ఎమోషన్**

**-వ్యాపారంలో విశిష్ట కృషికి కపిల్ మోహన్‌కు 'పద్మశ్రీ' పురస్కారం**

భారతదేశంలో 'ఓల్డ్ మాంక్' రమ్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కొన్ని తరాలుగా ఇది కేవలం ఒక పానీయంలా కాకుండా, స్నేహానికి, జ్ఞాపకాలకు ప్రతీకగా నిలిచిపోయింది. ఎలాంటి ఆర్భాటమైన ప్రకటనలు, సెలబ్రిటీ ప్రచారాలు లేకుండానే కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈ కల్ట్ క్లాసిక్ బ్రాండ్ వెనుక ఆసక్తికరమైన, ఆశ్చర్యపరిచే నిజాలు ఉన్నాయి. ముఖ్యంగా, ఈ రమ్ సామ్రాజ్యాన్ని శిఖరాగ్రానికి చేర్చిన వ్యక్తి జీవితంలో ఒక్క చుక్క కూడా మద్యం ముట్టని వ్యక్తి కావడం ఈ కథలోని అసలైన విశేషం.

### ఓల్డ్ మాంక్ పుట్టుక.. సృష్టికర్త ఎవరు?

చాలామంది ఓల్డ్ మాంక్ సృష్టికర్త బ్రిగేడియర్ కపిల్ మోహన్ అని భావిస్తారు. కానీ, నిజానికి ఈ డార్క్ రమ్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది ఆయన అన్నగారైన కల్నల్ వేద్ రతన్ మోహన్. 1954లో ఐరోపా పర్యటనకు వెళ్లిన ఆయన, అక్కడి బెనెడిక్టైన్ సన్యాసులు (వీశీఅఎం) ప్రత్యేక పద్ధతిలో తయారుచేసే లిక్కర్ల పట్ల ఆకర్షితులయ్యారు. వారి నైపుణ్యానికి, నిరాడంబరతకు నివాళిగా, ఓక్ చెక్క పీపాలలో ఏడేళ్ల పాటు నిల్వ ఉంచిన డార్క్ రమ్‌ను సృష్టించారు. ఆ సన్యాసుల స్ఫూర్తితోనే దీనికి 'ఓల్డ్ మాంక్' అని పేరు పెట్టారు. ఇక బాటిల్‌పై కనిపించే నవ్వు ముఖం, కంపెనీ పూర్వ యజమాని హెచ్.జి. మీకిన్‌ది అని చెబుతారు.

### మద్యం ముట్టని సామ్రాట్.. కపిల్ మోహన్

1973లో వేద్ రతన్ మోహన్ ఆకస్మికంగా మరణించడంతో, ఆయన తమ్ముడు, ఆర్మీ అధికారి అయిన బ్రిగేడియర్ కపిల్ మోహన్ 'మోహన్ మీకిన్ లిమిటెడ్' బాధ్యతలు స్వీకరించారు. భారత సైన్యంలో విశిష్ట సేవా మెడల్ అందుకున్న ఆయన, పూర్తి క్రమశిక్షణతో వ్యాపారంలోకి అడుగుపెట్టారు. ఆయన నాయకత్వంలోనే ఓల్డ్ మాంక్ దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ఖ్యాతి గడించింది. ఆశ్చర్యకరంగా, కపిల్ మోహన్ జీవితాంతం మద్యం ముట్టలేదు. ఆయన వ్యక్తిగతంగా టీ ప్రియుడు.


### ప్రకటనలు లేకుండానే అప్రతిహత విజయం

కపిల్ మోహన్ అనుసరించిన వ్యాపార వ్యూహం ఇప్పటికీ కార్పొరేట్ ప్రపంచానికి ఒక పాఠం లాంటిది. ఆయన ఓల్డ్ మాంక్ కోసం ఒక్క ప్రకటన కూడా ఇవ్వలేదు. ఉత్పత్తి నాణ్యతగా ఉంటే, దాని రుచే వినియోగదారులను ఆకర్షిస్తుందని, ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని ఆయన బలంగా నమ్మేవారు. 'మౌత్ టాక్' (ఒకరి నుంచి ఒకరికి తెలియడం) ద్వారానే ఈ బ్రాండ్ విజయవంతమైంది. ముఖ్యంగా, ఆర్మీ క్యాంటీన్ల ద్వారా సైనికులకు చేరువైన ఓల్డ్ మాంక్, వారి ద్వారా దేశంలోని ప్రతీ మూలకు పాకింది. ముఖ్యంగా యువతకు ఇది ఒక కల్ట్‌గా మారిపోయింది.

### ఒక ఎమోషన్.. ఒక లెగసీ

2000వ దశకంలో బకార్డీ వంటి విదేశీ బ్రాండ్ల పోటీ పెరిగినా, ఓల్డ్ మాంక్ తన స్థానాన్ని పదిలంగా కాపాడుకుంది. చాలా మంది భారతీయులకు ఇది కేవలం ఒక డ్రింక్ కాదు. అదొక ఎమోషన్. స్నేహితులతో గడిపిన క్షణాలు, కబుర్లు, పాత జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక మధురమైన అనుభూతి. మద్యం వ్యాపారాన్ని అత్యంత నైతిక విలువలతో నడిపిన కపిల్ మోహన్‌ను భారత ప్రభుత్వం 2010లో 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. ఆయన 2018లో కన్నుమూసేనాటికి, ఓల్డ్ మాంక్ బ్రాండ్‌ను అమెరికా, రష్యా, జపాన్ సహా 50కి పైగా దేశాలకు విస్తరింపజేశారు. ఒక ఉత్పత్తికి నాణ్యతే అసలైన ప్రచారం అని నిరూపించిన ఆయన, ఓల్డ్ మాంక్ రూపంలో చిరస్థాయిగా నిలిచిపోయారు.



# ఇది కూడా పోయింది..

## చివరి టీ20లోనూ టీమిండియాకు ఓటమే!

**-4-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న ఇంగ్లండ్**

**-శతకంతో చెలరేగిన కెప్టెన్ బట్లర్, మెరిసిన హ్యారీ బ్రూక్**

**-పోరాడి ఓడిన టీమిండియా, అర్ధశతకాలు చేసిన ఇషాన్, తిలక్**

**-జూలై 14 నుంచి ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ ప్రారంభం**

ఇంగ్లండ్ పర్యటనలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత యువ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్ 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన నామమాత్రపు ఐదో టీ20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఈ పర్యటన ఆరంభం నుంచి తడబడిన టీమిండియా, చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలుపుకుంటుందని భావించినా అది జరగలేదు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయాన్ని ఇంగ్లండ్ బ్యాటర్లు తలకిందులు చేశారు. ముఖ్యంగా జోస్ బట్లర్ (64 బంతుల్లో 131; 12 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 95లి; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో పరుగుల సునామీ సృష్టించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 233 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 4 ఓవర్లలో 60 పరుగులు, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకుని అత్యంత ఖరీదైన బౌలర్లుగా నిలిచారు. శివమ్ దూబే ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 258 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు సరైన ఆరంభం లభించలేదు. అభిషేక్ శర్మ (3) త్వరగా ఔటయ్యాడు. అయితే, ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 56; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకాలతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సంజూ శాంసన్ (27), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28) కూడా వేగంగా ఆడినా, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్య ఛేదన కష్టంగా మారింది. ఇంగ్లండ్ బౌలర్లలో శామ్ కరన్ 3 వికెట్లతో భారత పతనాన్ని శాసించగా, ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు. దీంతో భారత జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకే పరిమితమై ఓటమిని మూటగట్టుకుంది. అంతకుముందు, ఐర్లాండ్ చేతిలో సిరీస్ ఓటమిపాలైన టీమిండియాకు... ఇప్పుడు ఇంగ్లండ్ పై ఓటమితో ఈ పర్యటన ఓ పీడకలగా ముగిసింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జూలై 14న ప్రారంభం కానుంది.



## క్రీడలు

### బట్లర్ మెరుపు సెంచరీ, బ్రూక్ విధ్వంసం... టీమిండియా ముందు 258 పరుగుల భారీ టార్గెట్

**-ఐదో టీ20లో 3 వికెట్లకు 257 పరుగులు చేసిన ఇంగ్లండ్**

**-జోస్ బట్లర్ విధ్వంసకర శతకం**

**-కేవలం 64 బంతుల్లో 131 పరుగులతో చెలరేగిన బట్లర్**

**-అర్ధశతకంతో అదరగొట్టిన కెప్టెన్ హ్యారీ బ్రూక్ (95లి)**

**-ధారాళంగా పరుగులు సమర్పించుకున్న భారత బౌలర్లు**



సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ మైదానంలో జరుగుతున్న చివరిదైన ఐదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. భారత బౌలర్లను చితకబాదుతూ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ జోస్ బట్లర్ (131) అద్భుత శతకంతో చెలరేగగా, కెప్టెన్ హ్యారీ బ్రూక్ (95లి) మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. దీంతో ఈ మ్యాచ్ గెలవాలంటే టీమిండియా అద్భుతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఈ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (6) ఔటైనా, ఆ తర్వాత బట్లర్, బ్రూక్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. ముఖ్యంగా బట్లర్ కేవలం 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 131 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. బ్రూక్ 45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 95 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 233 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తొలుత బ్రూక్ వేగంగా ఆడగా, హాఫ్ సెంచరీ తర్వాత బట్లర్ విశ్వరూపం ప్రదర్శించాడు. మైదానం నలువైపులా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. దాంతో భారత బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. భారీగా పరుగులు సమర్పించుకోవడంతో పాటు, 15 వైడ్లు వేసి క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రదర్శించారు. దీనికి తోడు, పేలవమైన ఫీల్డింగ్ కూడా ఇంగ్లండ్ భారీ స్కోరుకు కారణమైంది. కీలక సమయాల్లో క్యాచ్‌లు జారవిడవడంతో బట్లర్, బ్రూక్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి భారీ స్కోరు అందించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మినహా అందరూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 పరుగులు, ప్రిన్స్ యాదవ్ 60 పరుగులు ఇచ్చారు. శివమ్ దూబే ఒకే ఓవర్లో 22 పరుగులు ఇచ్చినా.. బట్లర్, బెథెల్ వికెట్లను పడగొట్టాడు. ప్రసిద్ధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కింది.

# నా చివరి సినిమా కూడా ఇక్కడే..

## 'లెనిన్' సక్సెస్ మీట్‌లో ఏడ్చేసిన భాగ్యశ్రీ బోర్సే.. ఇదిగో వీడియో!



-'లెనిన్' సినిమా సక్సెస్ మీట్‌లో భావోద్వేగానికి గురైన నటి భాగ్యశ్రీ బోర్సే
-దర్శకుడు మురళి కిషోర్, హీరో అఖిల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు
-అభిమానుల గురించి మాట్లాడుతూ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్న వైనం
-హైదరాబాద్ తన కర్మభూమి అన్న హీరోయిన్
-తన చివరి సినిమా కూడా ఇక్కడే చేయాలనుకుంటున్నానని వ్యాఖ్య

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ఇవాళ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులకు, చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది అభిమానుల ప్రోత్సాహమేనని ఆమె ఉద్వేగంగా అన్నారు. ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ.. "ఈ రోజు నేను చాలా ఎమోషనల్‌గా ఉన్నాను. అందుకే నా మనసులో ఉన్నది మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణమైన వ్యక్తి, మా దర్శకుడు మురళి కిశోర్ గారికి ముందుగా ధన్యవాదాలు చెప్పాలి. మీరు నాకు 'భారతి' పాత్ర ఇవ్వకపోయి ఉంటే, ఈ రోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కేవి కావు. నా మీద నమ్మకం ఉంచి, నన్ను భారతిగా తెరపై నిలబెట్టినందుకు మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హీరో అఖిల్ గురించి మాట్లాడుతూ.. "అఖిల్ నువ్వు ఎంత కష్టపడ్డావో పక్కనుండి నేను చూశాను. గత పదేళ్లుగా నీ ప్రయాణం నాకు తెలియకపోయినా, అనుకున్న ఫలితాలు రానప్పుడు ఎలా ఉంటుందో నేను ఊహించగలను. రక్తం, చెమట, కన్నీళ్లు చిందించి పనిచేశావు. సెట్‌లో ఒక్క క్షణం కూడా ఖాళీగా కూర్చోవడం నేను చూడలేదు. ప్రతిదీ సరిగ్గా జరగాలని తపించేవాడివి. నువ్వు ఇంతటి ప్రేమకు, విజయానికి అర్హుడివి. పదో తేదీన నీకు విజయం వస్తుందని చెప్పాను, అది వచ్చింది. అఖిల్, నువ్వు వచ్చేశావ్. నీతో కలిసి మళ్లీ నటించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నువ్వొక అద్భుతమైన పెర్ఫార్మర్" అంటూ ప్రశంసించారు. చివరగా తన అభిమానుల గురించి మాట్లాడుతూ భాగ్యశ్రీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. "గత ఏడాదిన్నరగా నా ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. నేను కిందపడిపోయిన ప్రతిసారీ, నా అభిమానులు పంపిన మెసేజ్‌లు, రీల్స్, వారు చూపిన నిరంతర ప్రోత్సాహమే నన్ను ఈ రోజు ఇక్కడ నిలబెట్టింది" అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని.. "నేనొకటే చెప్పాలనుకుంటున్నాను. హైదరాబాద్ నా కర్మభూమి. నా చివరి సినిమా కూడా ఇక్కడే చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని తన ప్రసంగాన్ని ముగించారు. మురళి కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే 'భారతి' అనే పాత్రలో నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి స్పందనతో దూసుకుపోతోంది. ఈ సినిమాకు నవీన్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించగా, తమన్ సంగీతం సమకూర్చారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరించారు.



# డోస్' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

శుక్రవారం వచ్చిందనగానే ఓటీటీ లవర్స్ అంతా కూడా మలయాళం నుంచి ఏమైనా థ్రిల్లర్ సినిమాలు వచ్చాయేమోనని తప్పకుండా సెర్చ్ చేస్తారు. అందుకు కారణం ఈ జోనర్ నుంచి వచ్చే మలయాళ సినిమాలు ఒక రేంజ్ లో ఆకట్టుకుంటాయనే నమ్మకం. అలాంటి ఆడియన్స్ ఆసక్తికి తగినట్టుగానే ఈ శుక్రవారం ( జులై 10)వ తేదీన ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా పేరే 'డోస్'. సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో రూపొందిన ఈ సినిమా, 'అమెజాన్ ప్రైమ్'తో పాటు లైన్స్ గేట్ ప్లే .. 'ఆహా'లోను అందుబాటులో ఉంది. ప్రకాశ్ (సిజూ విల్సన్) ఒక కార్పొరేట్ హాస్పిటల్లో డాక్టర్ గా పనిచేస్తుంటాడు. అతని భార్య దివ్య ( కృషా కురూప్) అనారోగ్యంతో బాధపడుతూ ఉంటుంది. ఆమె అంటే అతనికి చాలా ఇష్టం. అందువలన ఆమె కోసం హాస్పిటల్ కి అందుబాటులోనే అతను నివసిస్తూ ఉంటాడు. అదే హాస్పిటల్లో అరుంధతి (దృశ్య రఘునాథ్) పనిచేస్తూ ఉంటుంది. చాలా కేసులు ఆమెనే డీల్ చేస్తూ ఉంటుంది. ఆమె భర్త 'పీటర్' మీడియాలో వర్క్ చేస్తుంటాడు. గతంలో ప్రకాశ్ అరుంధతి ప్రేమించ ుకుంటారు. అయితే కొన్ని కారణాల వలన ఆమెను ప్రకాశ్ పెళ్లి చేసుకోలేకపోతాడు. గర్భవతి అయిన తనని వదిలేసి వెళ్లిన అతనిపై అరుంధతి కోపంగా ఉంటుంది. ఇద్దరూ మాట్లాడుకోపోయిన ప్పటికీ, ఒకే హాస్పిటల్లో పనిచేస్తుంటారు. అక్కడే జూనియర్ డాక్టర్ గా 'నిఖిల్' పనిచేస్తుంటాడు. ఆ హాస్పిటల్ కి 'సీఈఓ' గా ఉన్న గోపీనాథ్ ( జగదీశ్) కూతురు 'అభిరామి'ని అతను ప్రేమిస్తూ ఉంటాడు. అయితే నిఖిల్ ధోరణి నచ్చని కారణంగా అభిరామి అతనికి దూరంగా ఉంటుంది. కొన్ని రోజులుగా ప్రకాశ్ చాలా డిప్రెషన్ లో ఉంటాడు. ఎందుకంటే తను టేకప్ చేసిన కేసులన్నీ ఫెయిల్ అవుతుం టాయి. పేషంట్లు ఒకరి తరువాత ఒకరిగా చని పోతుంటారు. తనపై గల కోపంతో అరుంధతినే ఇలా చేస్తుందనే అనుమానం అతనికి కలుగుతుంది. ఫలితంగా ఈ కేసును పరిష్కరించడానికి పోలీస్ ఆఫీసర్ వివేక్ (అశ్విన్ కుమార్) రంగంలోకి దిగుతాడు. అతని ఇన్వెస్టిగేషన్ లో ఎలాంటి నిజాలు బయటపడతాయి? నేరస్థులు ఎవరు? అనేది మిగతా కథ. ఈ కథ చాలావరకూ హాస్పిటల్ చుట్టూ తిరుగుతుంది. హాస్పిటల్లోని రోగులు అను మానాస్పదంగా చనిపోతుంటారు. ఆ మరణాల వెనుక ఎవరున్నారు? అందుకు గల కారణాలు ఎలాంటివి? ఏ కేసును పరిష్కరించడానికి రంగంలోకి దిగిన పోలీస్ ఆఫీసర్ వివేక్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది ఈ కథలోని ప్రధానమైన అంశం. మెడికల్ మాఫియా .. మెడికల్ థ్రిల్లర్ నేపథ్యంలో అడపాదడపా సినిమాలు వస్తూనే ఉన్నాయి. ఒక మెడిసిన్ ను టెస్ట్ చేయడం కోసం .. హాస్పిటల్ కి వచ్చిన అమాయక కుటుంబాలను టార్గెట్ చేయడం వంటి కథలు గతంలో వచ్చాయి. అయితే అందుకు భిన్నమైన ఒక కథతో రూపొందినదిగా 'డోస్' కనిపిస్తుంది. ఇద్దరు డాక్టర్ల మధ్య ప్రేమ వ్యవహారం, వారి వృత్తిపై ఎలాంటి ప్రభావం



చూపించిందనేది ఈ కథలోని సారాంశం. ఈ కథ మొదలైన మొదటి అరగంట వరకూ, ఏం జరుగుతుందనేది మనకి అర్థం కాదు. ఆ తరువాతనే ఒక్కో విషయం ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. హీరో అనుమానాలు .. అన్వేషణలతో ఫస్టు పార్టు, అందుకు సంబంధించిన పోలీస్ ఆఫీసర్ ఇన్వెస్టిగేషన్ తో సెకండ్ పార్టు సాగుతాయి. ఆడియన్స్ కూడా తమకి తెలియ కుండానే ఇన్వెస్టిగేట్ చేయడం మొదలుపెడతారు. వాళ్ల సందేహాలు నర్సులు .. జూనియర్ డాక్టర్ల చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఇలాంటి కథలలో నేరస్థులు ఎవరనేది ఎలాంటి పరిస్థితులలో ఆడియన్స్ గెస్ చేయకూడదు. గెస్ చేశారంటే ఆ కథ .. స్క్రీన్ ప్లే చాలా బలహీనంగా అల్లుకోవడం జరిగిందని అర్థం చేసుకోవాలి. ఈ కథలో కూడా కొన్ని పాత్రలపైకి అనుమానాలు వెళతాయి. అయితే కావాలని ఆడియన్స్ దృష్టిని అటు వైపు తీసుకెళ్లినట్టుగా అనిపించదు. ఆ తతంగం చాలా సహజంగా జరిగిపోతుంది. ఇక అసలైన నేరస్థులు ఎవరనేది కూడా దర్శకుడు చెప్పేంత వరకూ చాలామంది కనుక్కోలేరు. ఈ కథలో సస్పెన్స్ ఉంది .. మిస్టరీ ఉంది. సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్లోనే నడుస్తుంది. అయితే సాధ్యమైనంత వరకూ సహజత్వానికి దగ్గరగా చూపించడానికి ప్రయత్నిం చారు. ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్ గా జరిగిన ఈ ఆవిష్కరణ కొంతవరకూ ప్లస్ అయితే, మరికొంతవరకూ మైనస్ అయిందని కూడా చెప్పు కోవచ్చు. నటీనటుల నటన గురించి చెప్పుకునేంత స్థాయిలో పాత్రలను మలచలేదు. విష్ణుప్రసాద్ ఫొటోగ్రఫీ గోపీసుందర్ నేపథ్య సంగీతం ఫరవా లేదు. శ్యామ్ శశిధరన్ ఎడిటింగ్ వర్క్ కూడా ఓకే. సహజమైన మలుపులు .. గెస్ చేయలేని ట్విస్ట్ ఈ కథకి ప్రధానమైన బలంగా కనిపిస్తాయి అంతే.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455